సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం, 8, ఫిబ్రవరి, 2023



వికటించిన ఆహారం

కొత్తవలస వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో ఆహారం వికటించడంతో 14 మంది విద్యార్థినులు మంగళవారం అస్వస్థతకు గురయారు.

- 10లో



మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు

ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించి జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు.

- 10లో



సీఎంను కలిసిన పుష్పశ్రీవాణి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు తమ పాపతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

17న సాలూరులో మెగా జాబ్ మేళా

- 935 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్



పార్వతీపురం టౌన్: జిల్లాలో నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించేందుకు ఈనెల 17న సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడ్‌ఏపీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా సాగుతుందన్నారు. హెటిరో డ్రగ్స్, డెక్కన్‌ఫైన్ కెమికల్స్, ఎస్‌బీఐ కార్డ్స్, పేటీఎం, సంగీత మొబైల్స్, డెక్కన్ టెక్నాలజీస్, డైకిన్‌ఏపీ మాన్యుఫ్యాక్చర్స్, ముత్తూట్ ఫైనాన్స్, మదర్ అండ్ ఫాదర్ హోమ్ నర్సింగ్ సర్వీసెస్ తదితర 13 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని 935 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయని తెలిపారు. కంపెనీల్లో ట్రైనీ ఉద్యోగాల నుంచి ఫార్మాసిస్టు, ఎగ్జిక్యూటివ్, రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ తదితర ఉద్యోగాలలో నియామకాలు చేపడతాయన్నారు. రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వేతనాలు చెల్లిస్తారని తెలిపారు.18–30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్ అర్హతలు కల్గినవారు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల బయోడేటా, సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలు తీసుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఉద్యోగాలు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో చేయాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 63051 10947, 85559 09899, 63034 93720 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా లింగేశ్వరరెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా విద్యాశాఖాధికారి బి. లింగేశ్వరరెడ్డిను సమగ్ర శిక్ష ఏపీసీగా (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర శిక్ష ఏపీసీగా స్వామినాయుడు తమ మాతృ శాఖకు వెళ్లిపోయారు. ఆ బాధ్యతను డీఈఓకు అప్పగించింది.

సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణ గడువు పెంపు

విజయనగరం అర్బన్: సాదాబైనామా (గ్రామ క్రయ పురోణీ) భూముల క్రమబద్ధీకరణ గడువును ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరువరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జేసీ మయూర్‌అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాఉత్తర్వుల ప్రకారం 2021 నవంబర్ 1వ తేదీకి ముందు వరకు జరిగిన లావాదేవీలను పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ భూములకు మాత్రమే వర్తిస్తాయని పేర్కొన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసినవారు సన్న/చిన్నకారు రైతు అయి ఉండాలని, కొనుగోలు చేసిన భూమి వారి స్వాధీన అనుభవంలో ఉండాలన్నారు. రిజిస్టర్‌కాని గ్రామ పురోణీలకు సంబంధించిన దరఖాస్తు తహసీల్దార్, మీ సేవ కేంద్రం, గ్రామ మరియు వార్డు సచివాలయ కేంద్రాల్లో ఫారం–ఎక్స్ నమూనాలో నిర్ణీత గడువులో దాఖలు చేసుకొని భూములు తమపేరున క్రమబద్ధీకరించుకుని, భూ హక్కుపత్రాలు పొందాలని సూచించారు.

నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు



ఆతవ రమేష్

కొత్తవలస: నాడు చంద్రబాబు ప్రభుత్వంలో మీతోకలు కట్‌చేస్తా అంటూ బెదిరించి అవమానించారు.. నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులను గుర్తించి దేవదాయశాఖ ఆలయాల్లో ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో ప్రాధాన్యమివ్వడం సంతోషంగా ఉందని జిల్లా నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు ఆతవ రమేష్ పేర్కొన్నారు. కొత్తవలసలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

సాకారమవుతున్న సొంతింటి కల



పార్వతీపురం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం

- ఉగాదికి 9,841 గృహ ప్రవేశాలు
- ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించే దిశగా జిల్లా అధికారయంత్రాంగం
- పేదల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.6.89 కోట్లు మంజూరు
- నిర్మాణాలకు 300 మెట్రిక్ టన్నుల సిమెంట్ నిల్వలు
- 2 స్టాక్ పాయింట్‌లో ఇసుక
- 23,179 మంది పొదుపు మహిళలకు రూ.81.12 కోట్ల రుణం

మండలం	రూ.35వేల రుణం పొందిన లబ్ధిదారుల సంఖ్య
బలిజిపేట	2,995
కొమరాడ	1713
మక్కువ	1881
పాచిపెంట	1528
పాలకొండ అర్బన్	2,455
పార్వతీపురం	2,472
పార్వతీపురం అర్బన్	2,470
సాలూరు అర్బన	2,925
సాలూరు	2,321
సీతానగరం	2,419

పార్వతీపురం టౌన్: పేదల పక్కా ఇంటి కల సాకారమవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఉగాది నాటికి 9,841 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్న లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనుల్లో జోరుపెంచింది. జిల్లాలో 309 వైఎస్సార్ జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేసింది. జగనన్న కాలనీల్లో మొత్తం 24,740 గృహాలు మంజూరయ్యాయి. ఉగాది పండగ నాటికి ప్రభుత్వం నిర్దేశించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా కాలనీల్లో రూ.4.42 కోట్ల వ్యయంతో అప్రోచ్ రోడ్లు నిర్మించారు. విద్యుత్, నీటి వసతిని కల్పించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను అప్లోడ్ చేసిన నాలుగైదు రోజులకే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేస్తున్నారు. జిల్లా పరిధిలోని లేఅవుట్లలో శాశ్వత తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.5.50 కోట్లను మంజూరు చేయగా, ఇప్పటికే రూ.3.43 కోట్ల విలువైన పనులు పూర్తి చేశారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు రూ.6.89 కోట్లను మంజూరు చేశారు. జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు ఉండడంతో గృహనిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి.

పొదుపు మహిళలకు రుణాలు

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా మెప్మా, డీఆర్డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందిస్తోంది. ఇప్పటివరకు మొత్తం 23,179 మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.35వేల చొప్పున రూ.81.12 కోట్లను రుణంగా అందించారు. గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలకు తోడు ఈ మొత్తం కూడా వారికి అందడంతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు గృహనిర్మాణాల్లో బిజీ అయిపోయారు.

అందుబాటులో ఇసుక, స్టీల్, సిమెంట్

గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌ను లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని 2 స్టాక్ పాయింట్లలో ఇసుకను నిల్వ చేశారు. జిల్లాలోని గొడౌన్లలో 300 మెట్రిక్ టన్నుల సిమెంట్, వేయి మెట్రిక్ టన్నుల స్టీల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

అద్దె కష్టాలు తప్పాయి



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటి స్థలం మంజూరు చేసింది. నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది. ఇంటి నిర్మాణం పూర్తయింది. అద్దె కష్టాలు తొలగాయి. సొంతింటిలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవిస్తున్నాం.

– కరకవలస లలిత, అడ్డాపుశీల, పార్వతీపురం మండలం

త్వరలోనే గృహ ప్రవేశం



గ్రామంలో చిన్న కూల్ డ్రింక్ షాపు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నా. అద్దె ఇంట్లోనే ఉంటున్నా. నాకు ఎలాంటి భూమి, సొంతిల్లు లేదు. ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు గృహాన్ని కూడా మంజూరు చేసింది. దీంతో జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం చేపట్టాను. ఫ్లోరింగ్ పని మాత్రం మిగిలింది. ఈ పనిని కూడా పూర్తి చేసి త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం.

–కడి పావని, పాలకొండ అర్బన్

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేస్తాం



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు ఉగాది నాటికి 9,841 గృహప్రవేశాలు సాగేలా నిర్మాణాలపై దృష్టిసారించాం. లబ్ధిదారులకు కావాల్సిన నిర్మాణసామగ్రిని అందజేస్తున్నాం. సిమెంట్, స్టీల్, ఇసుకను నిల్వచేశాం. నిధుల సమస్య కూడా లేదు. చేసిన పనులకు సంబంధించి బిల్లులను అప్లోడ్ చేసిన వెంటనే విడుదలవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఇంజినీర్లు, సిబ్బందికి రోజువారి లక్ష్యాలను నిర్దేశించాం. యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– పి.రఘురాం, జిల్లా గృహనిర్మాణాధికారి (హౌసింగ్ పీడీ), పార్వతీపురం మన్యం

ఈకేవైసీ తప్పనిసరి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలోని రైతులందరూ ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యవసాయ అనుబంధ శాఖల మండలస్థాయి అధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖల పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై సమీక్షించారు. పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా, ఇతర ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మార్చిమొదటి వారంలో ఆర్‌బీకేలలో కస్టమర్ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి విడతగా జిల్లాలో 142 సెంటర్లకు బ్యాంకు ఖాతాలను తెరచి రుణాలు మంజూరుచేయాలని, మార్చి మొదటివారం నాటికి పరికరాలు తెప్పించాలన్నారు. రబీ పంటకు సంబంధించి ఈ పంట నమోదు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డా.ఎ.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు తీసుకుంటున్న చర్యలు, మందుల వినియోగం, అవగాహన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. కిశోరీ బాలికలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతిరోజు కనీసం 1400 ఓపీ నమోదుకావాలన్నారు. వైద్య సిబ్బంది అందరూ బయోమెట్రిక్‌లో హాజరు వేయాలన్నారు. తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో సిబ్బంది పనితీరుపై నివేదిక అందజేయాలని ఆర్‌బీఎస్‌కే పీఓ దవళ భాస్కరరావును ఆదేశించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.పార్వతి, డా.వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.టి.జగన్మోహనరావు, సీతంపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాకర్ కుటుంబానికి డీఎఫ్‌ఓ ఓదార్పు



మృతుని కుటుంబసభ్యులను ఓదార్చుతున్న డీఎఫ్‌ఓ డాక్టర్ అనూష, రేంజర్ తవిటినాయుడు

భామిని: నిత్యం ఏనుగులతో స్నేహంగా మెలిగిన లోకొండ లక్ష్మీనారాయణ అనే యువకుడిని పసుగుడి వద్ద సోమవారం రాత్రి ఏనుగుల గుంపు తొక్కి చంపిన సంగతి తెలిసిందే. మృతుని కుటుంబ సభ్యులను పార్వతీపురం మన్యం జిల్లా ఫారెస్ట్ అధికారి డాక్టర్ కె.అనూష, పాలకొండ రేంజర్ కె.తవిటినాయుడు మంగళవారం ఓదార్చారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయం అందించి ఆదుకుంటామన్నారు. మృతుని తండ్రి సింహాచలం, తల్లి అప్పలమ్మ, అన్నయ్య శ్యామ్‌కుమార్‌తో పాలకొండ ఏరియా ఆస్పత్రి వద్ద మాట్లాడారు. బత్తిలి ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో మృతదేహానికి శవ పంచనామా జరిపారు. ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు ట్రాకర్ మృతదేహాన్ని అప్పగించారు. అటవీశాఖ సిబ్బంది హరికృష్ణ, లక్ష్మణమూర్తి, పలువురు ట్రాకర్లు మృతదేహంతో పాటు పాతపట్నం మండలం సవరతిడ్డిమి గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. అటవీశాఖ పరిధిలో పనిచేసే 13 మంది ట్రాకర్లలో లక్ష్మీనారాయణ చురుగ్గా ఉండేవాడని, ఏనుగుల తొండం పట్టుకుని నడిచేవాడని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- టీటీడీ చైర్మన్, రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపు
- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమావేశం

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో సచివాలయాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. బుధవారం నుంచే ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు సమావేశాలు ప్రారంభించాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను త్వరితగతిన నియమించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పార్టీల అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, కరణం ధర్మశ్రీ, మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, యు.వి.రమణమూర్తిరాజు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, నియోజకవర్గ సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్, అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్సీ రఘురాజు, జగనన్న సచివాలయ కన్వీనర్ల ఉత్తరాంధ్ర కన్వీనర్ హర్షవర్థన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తున్నారా? లేదా?

- మెరకముడిదాం పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నించిన జెడ్పీచైర్మన్
- ఒక్క ఓపీ నమోదుకాకపోవడంపై ఆగ్రహం



ఆస్పత్రిలో సేవలపై వైద్యాధికారులు, సిబ్బందిని ప్రశ్నిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ఉదయం 11 గంటలవుతోంది.. ఒక్క ఓపీ నమోదుకాలేదు.. అంటే.. మీరు పనిచేస్తున్నారా? లేదా?.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తే ఒక్క ఓపీ కూడా ఎందుకు నమోదుకాలేదు... అంటూ మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందిని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ప్రశ్నించారు. వెంటనే డీఎంహెచ్‌ఓ ఎస్.వి. రమణకుమారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బంది తీరుపై తనకు ఫిర్యాదు అందిందని, విచారణ జరుపుతామని ఆమె తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నాణ్యతాప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ తాడ్డికృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధికమిటీ సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మందుల నిల్వలపై వైద్యాధికారి సాంబమూర్తిని ప్రశ్నించారు. ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తోందని, మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత పీహెచ్‌సీ వైద్యులపై ఉందన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.సీతారామరాజు, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తజన జాతర..!

- పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- సుమారు లక్షన్నర మంది రాక
- ఉదయం నుంచి కిక్కిరిసిన క్యూలు
- అమ్మవారికి మొక్కుబడుల చెల్లింపు



పోలమాంబ అమ్మవారు



భక్తులతో నిండిన చదురుగుడి క్యూకాంప్లెక్స్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడో జాతర భక్తజన జాతరగా మారింది. అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. చదురుగుడి, వనంగుడి వద్ద ఉన్న క్యూలైన్లు కిక్కిరిశాయి. శంబర గ్రామం భక్తజన సంద్రంగా మారింది. దారులన్నీ భక్తుల సందడితో కనిపించాయి. అమ్మవారిని సుమారు లక్షాయాభైవేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

గోముఖి నదిలో భక్తులు పుణ్యస్నానాలాచరించి పోలమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. రూ.10, రూ.50 క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించారు. తలనీలాలు సమర్పించారు. ఉదయం 10.15 గంటల తరువాత ఒక్కసారిగా భక్తులు శంబర గ్రామానికి చేరుకోవడంతో రద్దీ పెరిగింది. ప్రధానాలయం వద్ద క్యూకాంప్లెక్స్‌లు చాలక గోముఖి నదిపై ఉన్న బ్రిడ్జ్ వరకు ఎండలోనే నిరీక్షించారు. సాలూరు సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ ఏర్పాట్లు చేశారు. భక్తులకు శంబర గ్రామానికి చెందిన సత్యసాయిసేవా సమితి తాగునీటిని సరఫరా చేసింది.

సిరిమాను బండి, కర్రకు పూజలు

శంబర గ్రామంలోని ప్రధాన రహదారి వద్దనున్న సిరిమాను కర్రకు, బండికి భక్తులు పసుపు, కుంకమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీతో కొందరు ఆలయంలోకి వెళ్లలేక చదురుగుడి ముందున అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. ఈ సారి చెముడు రహదారివైపు కాకుండా, కవిరిపల్లి గ్రామం మీదుగా ఆటోలను విడిచిపెట్టడం, శంబర జెడ్పీహెచ్ఎస్ సమీపంలో పార్కింగ్ స్థలం నిండిపోవడంతో రహదారికి ఇరువైపులా ఆటోలు నిలుపదలచేశారు. కాసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. జాతరలో ఇద్దరు దివ్యాంగులు ఆలపించిన సినీగీతాలు, భక్తిగీతాలు భక్తులను మంత్రముగ్దులను చేశాయి.



తోటల్లో సహపంక్తి భోజనాలు



వేపచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

సంగమేశ్వరస్వామి ఆలయ ప్రసాదాల వేలం

వంగర: రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రసాదాల వేలం పాట జరిగింది. ఆలయ చైర్మన్ బోను ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బోను అప్పలనాయుడు అనే వ్యక్తి రూ.73వేలకు వేలం పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పొన్నాడ శ్యామలరావు, మాధవరావు, సిద్ధాంతం గణపతి, ఉగిరిముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

త్రో బాల్ రాష్ట్ర జట్టులో నెల్లిమర్ల విద్యార్థి



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

నెల్లిమర్ల: త్రో బాల్ రాష్ట్ర జట్టుకు నెల్లిమర్ల పట్టణానికి చెందిన విద్యార్థి ఎస్.దుర్గాప్రసాద్ ఎంపికయ్యాడు. ఈ నెల 4వ తేదీన విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రో బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న దుర్గాప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 18, 19 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో జరిగే సౌత్ జోన్ త్రోబాల్ సీనియర్స్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడు. దుర్గాప్రసాద్ పట్టణంలోని చక్ర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ పతివాడ శంకర్రావు, అధ్యాపకులు అభినందించారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

• కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ప్రతి పదేళ్లకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. ఆధార్‌లో నమోదు చేసిన వివరాల్లో ఎటువంటి మార్పులు ఉన్నప్పటికీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. దీనికోసం నెలరోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది.సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి ఏడేళ్ల మధ్య పిల్లలకు ఉచితంగా అప్‌డేట్ చేస్తారన్నారు. ఏడేళ్లు దాటిన వారికి ఆధార్ అప్‌డేట్ చేయకపోతే రూ.100 జరిమానాతో అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆధార్ అప్‌డేట్ కోసం జిల్లా వ్యాప్తంగా 125 సచివాలయాలను ఎంపిక చేశామని తెలిపారు. ప్రస్తుతం ఎంపిక చేసిన ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో మూడు రోజులపాటు ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల వివరాలను తప్పనిసరిగా సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, సీపీఓ పి.బాలాజీ, సచివాలయాల సమన్వయ కర్త అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికటించిన ఆహారం

• 14 మంది హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత
• స్థానిక పీహెచ్‌సీలో చికిత్స



అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎంపీడీఓ తదితరులు



108 వాహనంలో విద్యార్థినికి సేవలు అందిస్తున్న సిబ్బంది



మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి విద్యార్థినిని తరలిస్తున్న 108 సిబ్బంది



వసతి గృహం అధికారిణి జి.శ్రీదేవిని విచారణ చేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తదితరులు

కొత్తవలస: మండల కేంద్రంలో గల వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో ఆహారం వికటించడంతో 14 మంది విద్యార్థినులు మంగళవారం అస్వస్థతకు గురయారు. ఈ సంఘటనపై స్థానికులు, విద్యార్థినులు, వైద్యాధికారిణి ఎం.శ్రుతి అందించిన వివరాలిలా ఉన్నాయి. వసతి గృహంలో ప్రస్తుతం 55 మంది విద్యార్థినులు ఉంటున్నారు. సోమవారం రాత్రి వంకాయ, కందిపప్పు కూరతో విద్యార్థినులకు హాస్టల్ సిబ్బంది అన్నం పెట్టారు. మంగళవారం ఉదయం పులిహోర, శనగపప్పు చక్కి తిన్న తరువాత విద్యార్థినులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు పయనమయ్యారు. కొంత దూరం వచ్చేసరికి కొంతమంది విద్యార్థినులు కళ్లు తిరిగి పడిపోవడం, వాంతులు చేసుకోవడాన్ని స్థానికులు గమనించి పీహెచ్‌సీకి తరలించారు. వారిలో 14 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వైద్యాధికారిణి ఎం.శ్రుతి తమ సిబ్బందితో విద్యార్థినులకు చికిత్స చేశారు. నలుగురు విద్యార్థినులు తేరుకోవడంతో హాస్టల్‌కు పంపించేశారు. మిగిలిన వారిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం విశాఖ జిల్లా పెందుర్తి ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అలాగే మరో ముగ్గురు విద్యార్థినులను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఎవరికి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఈ పరిస్థితిపై తమసీల్దార్ ప్రసాద్‌రావు, ఆర్ఐ ఎస్.కిశోర్, ఎంఈఓ జి.శ్రీదేవి, ఎంపీపీ ఎన్.గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జి.శివ తదితరులు పీహెచ్‌సీకి వచ్చి సమీక్షించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారిణి ఎస్వీ రమణకుమారి, విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి యశోధనరావులు ఆస్పత్రికి వచ్చి విద్యార్థినులను పరామర్శించి, హాస్టల్ ప్రాంగణంలో పరిశీలించారు. అనంతరం వార్డెన్ జి.శ్రీదేవిని విచారణ చేశారు.

విద్యార్థినుల అస్వస్థతపై 24 గంటల్లో నివేదిక

వసతి గృహ విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసల అప్పారావు,జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి.హిమబిందు, సభ్యురాళ్లు సుధారాణి పట్నాయక్, భవానిలు వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ జరిగిన ఘటనపై సంబంధిత బీసీ సంక్షేమ అధికారులు కమిషన్‌కు 24 గంటల్లో తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వసతి గృహంలో గల మరుగుదొడ్లు, వంటగది తదితర పరిసరాల పరిశుభ్రతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహం సిబ్బంది బాధ్యతా రాహిత్యంగా ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులకు తరచూ వైద్యపరీక్షలు నిర్వహించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి యశోధనరావు, ఏఈఓ జి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం..!

• ఒంటరైన కామేష్‌కు అధికారులు, పెద్దలు

సాక్షి ఎఫెక్ట్...



కామేష్‌తో మాట్లాడుతున్న అధికారులు, స్థానిక పెద్దలు

చీపురుపల్లి: తల్లిదండ్రులు లేరని కుంగిపోయి అధైర్య పడొద్దని చక్కగా చదువుకుని లక్ష్యాలు చేరుకునే వరకు ధైర్యంగా ఉండాలని అందుకోసం అండగా ఉంటామని ఒంటరైన కామేష్‌కు ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక పెద్దలు ధైర్యం చెప్పారు. 16 రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందంతో ఒంటరిగా మిగిలిన వారి కొడుకు కామేష్ కోసం ఈ నెల 6న సాక్షి పత్రికలో 'ఒంటరినైపోయాను' శీర్షికన కథనం వెలువడింది. దీనికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందించారు. దీంతో ఆయన సూచనల మేరకు సమగ్ర శిశు సంక్షేమశాఖ, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, మండల విద్యాశాఖ, సచివాలయ ఉద్యోగులు, స్థానిక పెద్దలు మంగళవారం పట్టణంలోని విజయకాలనీకి వచ్చి నీలాతి కామేష్‌ను కలిసి పరామర్శించారు. ఆ యువకుడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కుంగిపోవద్దంటూ ధైర్యం చెప్పారు. ఇప్పటికే డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కామేష్ చదువు చివరి వరకు పూర్తి చేయాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని స్థానిక పెద్దలు హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు లేరనే బాధను దిగమింగుకుని కష్టపడి చదువుకుని చక్కని భవిష్యత్ పొందినప్పుడే తల్లిదండ్రులు సంతోషిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ కేవీ ఎస్.రాజేశ్వరి, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎమ్.విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు ఎం.అప్పలరాజు, అంగన్వాడీ వర్కర్ భారతి, సీఆర్‌పీ రామకృష్ణ, వలంటీర్ భాగ్యలక్ష్మి, స్థానిక పెద్దలు గవిడి లక్ష్మునాయుడు, మల్లెంపూడి శ్రీను, పీతల మురళి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జూన్ నాటికి టవర్లు సిద్ధం చేయాలి



మొబైల్ టవర్ల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో మొబైల్ టవర్లను రానున్న జూన్ నాటికి సిద్ధం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆపరేటర్లను ఆదేశించారు. టవర్ల నిర్మాణాల ప్రగతిపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, మొబైల్ ఆపరేటర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాను అభ్యుదయ జిల్లాగా కేంద్రప్రభుత్వం గుర్తించదన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపడడం వల్ల జిల్లా అభివృద్ధికి నాంది పడుతుందన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చి, జిల్లా రూపురేఖలు మారి, మారుమూల గ్రామాల్లో టెలి మెడిసిన్‌వంటి వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేస్తుందని, గ్రామ సచివాలం వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం కలుగుందన్నారు. దీని దృష్ట్యా జూన్ నాటికి టవర్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాకు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ 182 మొబైల్ టవర్లు మంజూరు చేసిందన్నారు. టవర్ల నిర్మాణంలో అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాలలో అవసరమైతే గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం అధికారుల సహాయ సహకారాలు తీసుకుని పనులు వేగవతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓలు బి.నవ్య, సి.విష్ణుచరణ్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డీఆర్ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమమలత, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

నాబార్డ్ ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, హాజరైన జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: నాబార్డ్ ఆధ్వర్యంలో జిల్లాలో రూ.1132 కోట్లతో గ్రామీణ రహదారులు, పాఠశాలల అభివృద్ధి, ఆస్పత్రుల సోషల్ ఇన్‌ఫ్రాకు సంబంధించి 428 ప్రాజెక్టులు చేపట్టినట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఈ పనుల వేగాన్ని పెంచి ప్రాజెక్టులన్నీ త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాబార్డ్ డీడీ నాగార్జునతో కలిసి 19 శాఖల అధికారులతో ప్రాజెక్ట్ వారీగా జరిగిన పనులు, ఖర్చయిన నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 19 శాఖలకు సంబంధించిన 428 ప్రాజెక్ట్‌లు మంజూరు చేయగా ఇంతవరకు 35 పూర్తయ్యాయని, 19 ప్రాజెక్ట్‌లు పూర్తయిన నివేదికలు అందించాల్సి ఉందని తెలిపారు. పూర్తయిన ప్రాజెక్టుల వివరాలను వెంటనే అందించి మిగిలిన నిధులను కూడా పొందాలని సూచించారు. ఇంకా 10 ప్రాజెక్ట్‌లను ప్రారంభించాలని నెమ్మదిగా జరుగుతున్న 58 ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. నిధుల కొరత లేనందున పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

డాక్యుమెంటేషన్ చేయాలి

పూర్తయిన ప్రాజెక్టలకు సంబంధించి ప్రాజెక్ట్ ఎన్ని రోజులు పట్టింది, ఎంత ఖర్చు అయ్యింది, ప్రాజెక్ట్ ఉద్దేశం ఏమిటి, ఎంత మందికి, ఎలా ఉపయోగపడుతోందన్న వివరాలతో కూడిన డాక్యుమెంటేషన్ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ ఫోటోలను కూడా అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా యూసీలు వెంటనే పంపించాలని, ఈ కార్యక్రమాలను ముఖ్యప్రణాళికాధికారి పర్యవేక్షించాలని సూచించారు. నాబార్డ్ డీడీ నాగార్జున మాట్లాడుతూ మూడేళ్లలో శతశాతం ఆర్ఐడీఎఫ్ బట్వాడా జరగాలని తెలిపారు. ఆలస్యమైతే ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని, పూర్తి బిల్లులను సబ్‌మిట్ చేస్తే చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ఆయ శాఖల ఉన్నతాధికారి ద్వారా బిల్లులను, యూసీలను సమర్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికారులు, విద్యాశాఖ, వైద్యశాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

9న అండర్ 17 బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

శృంగవరపుకోట: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ఈనెల9వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు తెన్నుబొడ్డవరలోని డాక్టర్ వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌లో నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీరాములు తెలిపారు. జిల్లాస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్వీ రమణ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల యాజమాన్యం భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబర్ 7989199534ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌హెచ్ఎం పోస్టుల మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఖాళీల భర్తీకి సంబంధించి ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో సెక్యూరిటీ గార్డు, పిడియాట్రిక్ సోషల్ వర్కర్, ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9 వతేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత డాక్యుమెంట్స్‌పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి అందజేయాలని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

జిల్లా కోర్టు కాంప్లెక్స్ తరలింపు

• హైకోర్టు గ్రీన్ సిగ్నల్



దుప్పాడలో భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను తాత్కాలిక భవనంలోకి తరలించేందుకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుత భవనం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన సముదాయాన్ని నిర్మించేందుకు హైకోర్టు సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దుప్పాడలో ఉన్న గ్రేస్ పబ్లిక్ స్కూల్ సముదాయంలోకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కోర్టు కార్యకలాపాల నిర్వహణకు అనుగుణంగా కొంత మార్పులు, చేర్పులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి సూచించారు. ఈ ప్రక్రియ ఏప్రిల్‌కు పూర్తయ్యేలా పనులు చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా న్యాయమూర్తి సాయికల్యాణచక్రవర్తితో పాటు న్యాయవాదుల సంఘప్రతినిధులు బి.సంజీవరావు,వై.హరికృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కేవీఎన్ తమ్మన్నశెట్టితో పాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు మంగళవారం దుప్పాడ చేరుకుని ఆ భవనాన్ని నిశితంగా పరిశీలించారు. ప్రస్తుతం వీటీ ఆగ్రహారంలో ఉన్న కోర్టు కాంప్లెక్స్ స్థానంలో జీప్లస్ సిక్స్ నూతన భవనాన్ని నిర్మించేందుకు మార్గం సుగమమైంది. సుమారు రూ. 113 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని రెండు, మూడేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



మీసాల ప్రణతిశ్రీజ



రాజాపు రిషిత



వెంకట్ యశ్వంత్



బొత్స హర్షవర్ధన్



వారణాసి దీపేష్

ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించి జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

– సాక్షి న్యూస్ నెట్‌వర్క్



వడ్డాది శ్రీసూర్య గుణవంత్



సూరి శ్రీధనుష్



కల్యాణం బాలాజీ

బాలికల్లో టాప్ ప్రణతిశ్రీజ

విజయనగరం జిల్లా గుర్ల మండల కేంద్రానికి చెందిన మీసాల ప్రణతిశ్రీజ 99.99 పర్సంటైల్ సాధించి బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలిచింది. ఆమె తండ్రి అప్పలనాయుడు రైల్వే ఉద్యోగి కాగా, తల్లి అన్నపూర్ణ కుమరాం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పని చేస్తున్నారు. విజయనగరం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు 96 పర్సంటైల్‌కు పైగా సాధించారు. వారిలో నడుపూరు శ్రీనివాస్ 99.13, ఎస్.మనోహర 98.54, సిరికి భరత్ కుమార్ 98.49, మౌలి మనోహర్ వలిరెడ్డి 98.12, టి.వెంకటేష్ 96.65, ముక్కవల్లి సుబ్రహ్మణ్యం 96.46 పర్సంటైల్స్ లభించాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం మండల కేంద్రానికి వారణాసి దీపేష్ 99.96 పర్సంటైల్ సాధించాడు. దీపేష్ 1 నుంచి 6వ తరగతి వరకు పార్వతీపురంలోని సురేష్ రెసిడెన్షియల్ స్కూల్‌లో, 7వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు గుంటూరు భాష్యం విద్యా సంస్థల్లో చదువుకున్నాడు. అలాగే వీరఘట్టానికి చెందిన మరో విద్యార్థి వడ్డాది శ్రీసూర్య గుణవంత్ 99.14 పర్సంటైల్ సాధించాడు.ఈ విద్యార్థి 1 నుంచి 6వ తరగతి వరకు రాజాంలోని డీఏవీ స్కూల్‌లోను, 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విశాఖపట్నంలోని శశి విద్యా సంస్థల్లో చదువుకున్నాడు.

వెంకట్ యశ్వంత్‌కు 99.94 పర్సంటైల్

బొండపల్లి మండలం రాచకిండాం గ్రామానికి చెందిన చొక్కాకు వెంకట్ యశ్వంత్ 99.94 పర్సంటైల్ సాధించాడు. ఈ విద్యార్థి విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుతూ పరీక్షలకు హాజరయ్యాడు.

హర్షవర్ధన్‌కు 98.5 పర్సంటైల్

గరుగుబిల్లి మండలం బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స వర్ధన్ 98.5 పర్సంటైల్ సాధించాడు. ఈ విద్యార్థి విజయవాడలోని ప్రైవేట్ కళాశాలలో ఎంపీసీ చదివాడు.

99.57 పర్సంటైల్‌తో రిషిత

పాలకొండ నగరపంచాయతీ పరిధి నీలమ్మకాలనీకి చెందిన రాజాపు రిషిత జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.57 పర్సంటైల్ సాధించింది. విశాఖలో ప్రస్తుతం ఇంటర్‌మీడియట్ రెండవ సంవత్సరం ఎంపీసీ చదువుతోంది.

'మోడల్' విద్యార్థి ప్రతిభ

మెరకముడిదాం మండలంలోని గర్భాం ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థి కల్యాణం బాలాజీ జేఈఈ మెయిన్స్‌లో 88.9 శాతం మార్కులు సాధించాడు. తమ విద్యార్థి బాలాజీ మంచి మార్కులు సాధించడంతో పాఠశాల ప్రిన్సిపాల్ డీవీఎస్.అరుణ, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సూరి శ్రీధనుష్‌కు 99.79 పర్సంటైల్

పాలకొండలోని అంజనేయనగర్ కాలనీకి చెందిన సూరి శ్రీధనుష్ జేఈఈ మెయిన్స్‌లో 99.79 పర్సంటైల్ సాధించాడు. విశాఖలో ఇంటర్‌మీడియట్ చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి



అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రోజు రోజుకు విస్తరిస్తున్న నగరంలోని అన్ని ప్రాంతాల్లో సమ ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 1వ డివిజన్ లక్ష్మీగణపతి కాలనీలో రూ.5 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్డు, కాలువ నిర్మాణ పనులను ఆయనతో పాటు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కొబ్బరికాయ కొట్టి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నగరంలోని అన్ని డివిజన్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో చేపడుతున్నామన్నారు. శంకుస్థాపనలు చేయడమే కాకుండా అనతి కాలంలో పూర్తి చేసి వాటి ప్రారంభోత్సవాలను కూడా చేపడుతున్నామన్నారు. 5 లక్షల రూపాయలతో 1వ డివిజన్‌లో కాలువ, రహదారి నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. లక్ష్మీ గణపతి కాలనీలో ప్రజల కోరిక మేరకు రహదారి కాలువ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి ముచ్చు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

విజయనగరం క్రైమ్: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో చోరీ కేసుకు సంబంధించి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ కాలనీ స్వర్గధామం ఎదురుగా ఉన్న పాన్‌షాపులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగుల గొట్టి పాన్‌షాపులో ఉన్నటువంటి సామగ్రి, నగదు పట్టుకుపోయినట్లు బాధితుడు టూటౌన్ పోలీసులకు ఈ నెల 3న ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పలు ఆధారాలను సేకరించి పాత నేరస్తులుగా గుర్తించారు. రాజ్యలక్ష్మి థియేటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన నారుకుర్తి సాయికృష్ణ, బొండులగూడెంకి చెందిన గండి భాస్కర నాగశర్మ, లింగధారిపేటకి చెందిన టేకు నవీన్‌కుమార్ సింగ్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.600 నగదు, 17 సిగిరెట్ బాక్స్‌లను సీజ్ చేసి రిమాండ్‌కి తరలించామని సీఐ తెలిపారు.

పటువర్ధనంలో ప్రజాభిప్రాయసేకరణ

• ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారుల పర్యటన



ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న ఆర్డీవో ఎం.అప్పారావు, వివిధ శాఖల అధికారులు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన వంగర మండలం పటువర్ధనం నిర్వాసిత గ్రామంలో చీపురుపల్లి ఆర్డీవో ఎం.అప్పారావుతోపాటు అధికారుల కమిటీ మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఇక్కడ ప్రజలకు శాశ్వత పునరావాసం కల్పించాలి లేదా పాత గ్రామంలోనే గృహాలు నిర్మించి వాటికి శాశ్వత హక్కులు సమకూర్చడంతోపాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని మడ్డువలస నిర్వాసిత పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు నల్ల కాశినాయుడు, నల్ల పరశురాంనాయుడుతోపాటు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పునరావాసంపై చీపురుపల్లి ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారుల కమిటీ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఎం.అప్పారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

పాత గ్రామంలోనే ఇళ్లు నిర్మించాలి

ఈ సందర్భంగా ఎంపీటీసీ తెంటు కుమారి, జోగినాయుడు మాట్లాడుతూ పాత గ్రామంలోనే ఇళ్లు నిర్మించి పూర్తి హక్కులు కల్పించి గ్రామాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు. నల్ల పరశురాంనాయుడు, మడ్డువలస నిర్వాసిత పోరాట కమిటీ గౌరవ అధ్యక్షుడు నల్ల కాశినాయుడులు మాట్లాడుతూ హైకోర్టు సూచనల మేరకు పటువర్ధనం-బాగెంపేట గ్రామాల మధ్య భూమి కొనుగోలు చేసి పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పాత గ్రామంలోనే కొత్త ఇళ్లు నిర్మించి శాశ్వత హక్కు కల్పించాలని, తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం, మౌలిక వసతులతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులకు తెలియజేశారు. పంచాయతీ నిధులు గ్రామ అభివృద్ధికి వినియోగించేలా ఉత్తర్వులు అందించాలని సర్పంచ్ నల్ల సూర్యం వినతిపత్రం అందించారు. అనంతరం ఆర్డీవో అప్పారావు మాట్లాడుతూ సమగ్ర ప్రజాభిప్రాయసేకరణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో వై.దుర్గారావు, ఏఈలు సూర్యనారాయణ, ఆనందరావు, ప్రాజెక్టు డీఈ నర్మదాపటానియక్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.